

కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం


రాజగోపాలస్వామి ఆలయం


ఆదికేశవస్వామి ఆలయం


నాగేశ్వరస్వామి ఆలయం

- కొత్తపట్నం గ్రామంలో 1429 ఏ, బీ సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో ఎండోమెంట్ భూములుగా నమోదు
- వాటిలోని 83.64 ఎకరాల భూముల్లో గృహాలు, స్థలాలకు నిలిచిపోయిన క్రయవిక్రయాలు
- పలు రకాల రుణాలకూ బ్రేకులు
- ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్న 3 వేల కుటుంబాలు
- వాస్తవానికి ఎండోమెంట్ భూములు 1.26 ఎకరాలు మాత్రమే
- ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్న ఎండోమెంట్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు
- ఆయా కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయిన గృహాలు, స్థలాల యజమానులు
- పాలకులైనా పట్టించుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం

కొత్తపట్నం: రెవెన్యూ, రిజిస్ట్రేషన్, దేవదాయశాఖల అధికారుల మధ్య సమన్వయలోపం కొత్తపట్నంలోని 3 వేల కుటుంబాల ప్రజలకు శాపంగా మారింది. వారి గృహాలు, స్థలాలకు సర్వ హక్కులు ఉండి కూడా క్రయవిక్రయాలకు, రుణాలకు నోచుకోలేక ఏళ్ల తరబడి అవస్థపడుతున్నారు. వందేళ్ల నుంచి ఉన్న రిజిస్ట్రేషన్ కాగితాలు, డాక్యుమెంట్లు చూపించినా రిజిస్ట్రేషన్లు చేయకుండా అధికారులు ససేమిరా అంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తప్పిదానికి తామంతా నష్టపోతున్నామంటూ వాపోతున్నారు. సుమారు 10 సంవత్సరాల నుంచి కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో పాలకులైనా పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పైగా, సబ్ రిజిస్ట్రార్ మారినప్పుడల్లా తమకు తలనొప్పులు తప్పడం లేదంటున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకెళ్తే..

కొత్తపట్నం గ్రామానికి సంబంధించిన సర్వే నంబర్ 1429 ఏ, 1429 బీలో ఉన్న భూములు ఎండోమెంట్ భూములుగా ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదయ్యాయి. 1429 ఏలో 30.05 ఎకరాలు, 1429 బీలో 53.64 ఎకరాలు కలిపి మొత్తం 83.64 ఎకరాలు గ్రామ కంఠంగా రికార్డుల్లో నమోదయ్యాయి. కానీ, ఆన్‌లైన్‌లో 83.64 ఎకరాలు మొత్తం ఎండోమెంట్ భూమిగా చూపిస్తుండటంతో క్రయవిక్రయాలకు, రుణాలకు అవకాశం లేకుండా పోవడంతో పదేళ్లుగా ఆయా భూముల్లోని గృహాలు, స్థలాల యజమానులు నష్టపోతున్నారు.


కొత్తపట్నం గ్రామం కంఠం 1429 ఏ, బీ సర్వే నంబర్లలో ఉన్న గృహాలు

దేవదాయశాఖ భూములు 1.26 ఎకరాలే...

రెవెన్యూ లెక్కలు, ఎఫ్ఎంబీ లెక్కలు, ఎండోమెంట్ లెక్కల ప్రకారం ఎండోమెంట్‌కు 1.26 ఎకరాల భూమి మాత్రమే ఉంది. కానీ, ఆన్‌లైన్‌లో 83.64 ఎకరాలు ఉన్నట్లు చూపిస్తోంది. ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదవడంతో ఏళ్ల తరబడి కొత్తపట్నం ప్రజలను సమస్య వెంటాడుతోంది. కొత్తపట్నంలో ఎండోమెంట్‌కు సంబంధించి రాజగోపాలస్వామి ఆలయానికి 36 సెంట్లు, ఆదికేశవస్వామి ఆలయానికి 20 సెంట్లు, నాగేశ్వరస్వామి ఆలయానికి 70 సెంట్ల చొప్పున భూమి ఉంది. మూడు ఆలయాలకు కలుపుకుని 1.26 ఎకరాలు మాత్రమే ఉంది. కానీ, ఆన్‌లైన్‌లో ఎండోమెంట్ కింద 83.64 ఎకరాలు చూపిస్తోంది. అయితే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే.. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇది గ్రామ కంఠం భూమి అని తహసీల్దార్‌తో లెటర్ తీసుకొస్తే తాము రిజిస్ట్రేషన్ చేస్తామని అంటున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే.. 1429 ఏ, బీ సర్వే నంబర్లు ఎండోమెంట్‌లో ఉన్నాయని అంటున్నారు. ఎండోమెంట్ అధికారులు తమ స్థలం ఎంత ఉందనే దానిపై అర్జీ పెడితే.. దానిని సబ్ డివిజన్ చేసి మిగతా భూమి తేల్చి లెటర్లు ఇస్తామని తహసీల్దార్ అంటున్నారు. ఎండోమెంట్ అధికారులను అడిగితే లెటరు ఇస్తామని అంటున్నారు. ఇలా.. అధికారులు ఒకరిపై మరొకరు చెప్పుకుని కాలయాపన చేస్తున్నారు. ఈ సర్వే నంబర్లలో 3 వేల కుటుంబాల వారు గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. క్రయవిక్రయాలు, బ్యాంక్ లోన్లు, తనకాలు, మార్ట్‌గేజ్‌లు అన్నీ నిలిచిపోవడంతో అధికారుల తీరు ఆయా యజమానులకు తీవ్రస్థాయిలో తలనొప్పిగా మారింది.

వందేళ్ల నుంచి లింక్ డాక్యుమెంట్లు ఉన్నా.. రిజిస్ట్రేషన్లు నిలిపివేత...

కొత్తపట్నం సర్వే నంబర్ 1429 ఏ, బీలో వందేళ్ల నుంచి రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆయా డాక్యుమెంట్ నంబర్లు కూడా ఉన్నాయి. అనేక మందికి ఎన్నోసార్లు రిజిస్ట్రేషన్లు చేసిన లింక్ డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. అవి చూపించినా రిజిస్ట్రేషన్ అధికారులు వెనక్కిపంపుతున్నారు. మార్ట్‌గేజ్ లోన్ల కోసం వెళ్లినా చేయడం లేదు. దీంతో ఏంచేయాలో అర్థంగాక బాధితులు తిరిగితిరిగి అలసిపోయారు. రెవెన్యూ, ఎండోమెంట్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేషన్లు అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సుల్లో తెలియజేశాం

మేము ఇంతకుముందే రెవెన్యూ సదస్సుల్లో మా దేవదాయ శాఖ ఆలయాలకు ఉన్న స్థలాన్ని సబ్ డివిజన్ చేయమని చెప్పాం. ఇప్పుడు అవసరమైతే మళ్లీ ఆ వివరాలిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య కొనసాగుతోంది. త్వరలో పరిష్కారం చేస్తాం.

– పానకాలరావు, ఎండోమెంట్ ఏసీ

అధికారుల తప్పిదం వలనే ప్రజలకు ఇబ్బందులు

కొత్తపట్నం సర్వే నంబర్ 1429 ఏ, బీలో నివసిస్తున్న 3 వేల కుటుంబాలు రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాలు, మార్ట్‌గేజ్ రుణాల సమస్యలతో పదేళ్లుగా అవస్థపడుతున్నాయి. నేను కూడా సర్వే నంబర్ 1429 ఏలో సమస్య పరిష్కారం కోసం ఎన్నోసార్లు కార్యాలయం చుట్టూ తిరుగాను. కానీ, సమస్య పరిష్కారం కాకపోవడంతో అలాగే వదిలేశాను. మూడు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. వారంతా సమన్వయం చేసుకుని పనిచేసి సబ్ డివిజన్ చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– దేగా శ్రీను, కొత్తపట్నం

ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కోసం తిరుగుతున్నా



సర్వే నంబర్ 1429ఏలో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కోసం తిరుగుతున్నా. 40 సంవత్సరాల నుంచి నాకు స్థలం ఉంది. అందులో కొత్త ఇల్లు నిర్మించుకోవడానికి రిజిస్ట్రేషన్ అవసరమని వెళితే.. తహసీల్దార్ దగ్గర లెటర్ తెస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని చెబుతున్నారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను, ఇంటికి మీటరు అన్నీ ఉన్నా రిజిస్ట్రేషన్ చేయడం లేదు. విచారించి రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నాను.

– ఎస్‌కే గౌస్‌బాషా, కొత్తపట్నం

విలువైన స్థలం ఉండి కూడా నిరుపయోగమే



ఆపదలో తనకా పెట్టుకుని అవసరానికి డబ్బు తీసుకోవడానికి విలువైన స్థలం ఉండి కూడా నిరుపయోగంగా మారింది. సర్వే నంబర్ 1429బీలో నాకు ఇంటి స్థలం ఉంది. గతంలో రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. కానీ, ప్రస్తుతం తనకా పెట్టుకుని నగదు తీసుకోవాలంటే మార్ట్‌గేజ్ చేసుకోవాలని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే.. తహసీల్దార్ దగ్గర నుంచి లెటర్ తేవాలని చెబుతున్నారు. ఎండోమెంట్ భూములంటూ తహసీల్దార్ లెటర్ ఇవ్వకపోవడంతో మార్ట్‌గేజ్ ఆగిపోయింది. ఈ విధంగా నాతో పాటు చాలా మంది అవస్థపడుతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించాలి.

– పొదిలి బాబావలి, కొత్తపట్నం

ఎండోమెంట్ అధికారులు భూమి వివరాలు ఇవ్వాలి

సర్వే నంబర్ 1429 ఏ, బీ మా రిజిష్టర్లలో ఎండోమెంట్‌గా నమోదై ఉంది. ఎండోమెంట్ అధికారులు వారి దేవాలయాలకు ఎన్ని ఎకరాలు ఉన్నాయో అర్జీ రూపంలో ఇస్తే.. మేము సబ్ డివిజన్ చేసి రికార్డులో మారుస్తాం. అప్పుడే ఎవరి ఇంటి స్థలం ఎంత ఉందనే విషయంపై లెటర్ ఇవ్వగలం. అప్పటిదాకా మేము లెటర్లు ఇవ్వలేం.

– మధుసూదన్‌రావు, తహసీల్దార్, కొత్తపట్నం

క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన పోలేరమ్మతల్లి విగ్రహం

కొత్తపట్నం: మండలంలోని మడనూరు గ్రామం గమ్మళ్లపాలెంలో పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ కలశాలతో ప్రదక్షిణలు చేశారు. పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


మృతురాలు తులసమ్మ

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో ఒంగోలులోని కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు తులసమ్మ (60) గాయాలపాలైంది. ఆమెను 108 అంబులెన్స్‌లో స్థానిక జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆమె పూర్తి వివరాలు తెలిసిన వారు ఒంగోలు తాలూకా పోలీసులను సంప్రదించాలని సీఐ అజయ్ కుమార్ తెలిపారు.

నేడు వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ

యర్రగొండపాలెం: వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు జమియతుల్ ఉలుమా ఐక్యవేదిక తెలిపింది. ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండ్‌కు సమీపంలోని నూరాని మజీద్ వద్ద నుంచి శాంతియుత ర్యాలీ ఉంటుందని, ముస్లింలు, మేధావులు ఈ ర్యాలీలో పాల్గొనాలని ఆ వేదిక కోరింది.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కళ్యాణం

కొత్తపట్నం: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెం బిల్డింగుల పాలెంలో గల రామాలయం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ ఆధ్వర్యంలో శ్రీవాణి విద్యానికేతన్, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంయుక్త నిర్వహణలో ఈ వేడుక నిర్వహించారు. మొదటిగా డాక్టర్ చాపల వంశీకృష్ణ ఇంటి నుంచి పండితులు, పూజారుల వేద మంత్రాల మధ్య మేళతాళాలతో సీతారాముల ఉత్సవ మూర్తులను కళ్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంతో ఆ ఊరంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కళ్యాణానికి ముందుగా హాస్పిటల్ సిబ్బంది ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. కె.పల్లెపాలెం గ్రామ అభివృద్ధికి తోడ్పడిన వివిధ రంగాల ప్రముఖులను గ్రామస్తులంతా ఘనంగా సత్కరించారు. గ్రామంలో విద్యాభివృద్ధికి చేసిన కృషికిగానూ రిటైర్డ్ దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెయ్యాల వెంకటేశ్వర్లు, సామాజిక సేవారంగం నుంచి బుక్కపురం వెంకట నాయుడును ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పల్లెపాలెం గ్రామంలో విద్య, వైద్య రంగాలలో డాక్టర్ చాపల వంశీకృష్ణ కుటుంబం అందిస్తున్న సేవలను కె.పల్లెపాలెం గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో కాపులు, సమ్మిదులు, పూజారులు, చాపల వినుకొండయ్య, శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ చాపల కోటేశ్వర రావు, శ్రీరామ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ డైరెక్టర్ చాపల శ్రీనివాసులు, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, గర్భకోశ వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతకుమారి, వారి కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న నిర్వాహకులు

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, సురేష్‌బాబు

చీమకుర్తి: ఈస్టర్ పర్వదినం సందర్భంగా చీమకుర్తి ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, ఆస్పత్రి సిబ్బందికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు పాటిబండ్ల సురేష్‌బాబు, స్థానిక కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో స్థానిక డాక్టర్లు హనీఫ్, శ్వేత, స్థానికులు యోహాను, యువరాజు, మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

చీమకుర్తి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరాలలో ఏసుక్రీస్తు పునరుత్థాన వేడుకలను విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంచికలపాడులోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో దైవజనుడు మాగులూరి పురుషోత్తం ఏసుక్రీస్తు పునరుత్థానం గురించి దైవసందేశాన్ని అందించారు. చీమలమర్రి బాప్టిస్ట్ చర్చిలో దైవజనుడు గద్దల దేవసహాయం ఏసుక్రీస్తు పునరుత్థానము రోజు ఆయనను విశ్వసించిన వారికి నిత్యజీవము వస్తుందని తెలిపారు. క్వాయర్ బృందం క్రీస్తు గీతాలు ఆలపించింది. సంఘపెద్దలు, సంఘస్తులు, విశ్వాసులు, యవనస్తులు పాల్గొన్నారు.


మంచికలపాడులో క్రీస్తు వాక్యం అందిస్తున్న దైవజనుడు మాగులూరి పురుషోత్తం

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన బోధన


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ముండ్లమూరు (కురిచేడు): విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని హెచ్‌డబ్ల్యూ ప్రధానోపాధ్యాయురాలు కే శారద అన్నారు. మండల కేంద్రం ముండ్లమూరు లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సీహెచ్ లలితా కిరణ్, అంగన్‌వాడీ కార్యకర్త మంజుల వాణి విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచి పుస్తకపఠనం అలవాటు చేయడం అలవర్చాలన్నారు.

ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా నరేంద్రరెడ్డి


ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌తో ఆటో డ్రైవర్లు

దొనకొండ: మండల ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా పిచ్చాల నరేంద్రరెడ్డిని ఆటో యూనియన్ డ్రైవర్లు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అందరం కలిసి మెలిసి యూనియన్‌గా ఉండాలని నరేంద్రరెడ్డి ఆటో డ్రైవర్లను కోరారు.

గుంటిగంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటిగంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి. విజయలక్ష్మి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాల, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, కానుకలు సమర్పించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తీర్చే కల్పవల్లిగా పిలువబడే అమ్మవారిని సందర్శించడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. భక్తులు జంతువులను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగశిలలను భక్తులు, మల్లికార్జునస్వామి వారిని పూజించారు. ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కే గురుబ్రహ్మం, ఏఆర్ ప్రసాద్ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాన్ని పర్యవేక్షించారు.

ఆలయాల్లో భక్తుల విశేష పూజలు

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.